జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 15-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 396 పేజీలు: 4 వెల : రూ.7

### శని పట్టిందంటూ మద్యం మత్తులో..

# విగ్రహాలు ధ్వంసం



* జి.సిగడాం మండలంలో ఈనెల 11న ఘటన
* నిందితుడిని అదుపులోకి తీసుకున్నా పోలీసులు
* గ్రామస్థుల సహకారం అభినందనీయం
* ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైం, జూలై 14 (వార్త):** తనకు శని పట్టుకోవడం వల్ల జీవితం పోయిందని, దేవుడు అన్యాయం చేశాడని, దేవుడు లేడంటూ మద్యం మత్తులో రామకృష్ణ అనే వ్యక్తి శివాలయంలో నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేశాడని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జి.సిగడాం మండలంలోని దాలంరాజువలస గ్రామంలో ఈనెల11వ తేదీ రాత్రి శివాలయం పక్కన ఉన్న నవగ్రహ ఆలయంలోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి నవగ్రహ విగ్రహాలను ధ్వసం చేశారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేయగా దాలం రాజువలస గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి ఈ ఘటనకు పాల్పడ్డాడన్నారు. ఈనెల 11న కార్పెంటర్ నారాయణ పనిలోనికి రమ్మని రామకృష్ణకు రూ.300 ఇచ్చాడన్నారు. అదే రోజు రాత్రి సుమారు 7.10 గంటల సమయంలో సర్వేశ్వరం గ్రామ జంక్షన్ సమీపంలో ఉన్న మద్యం షాప్‌నకు వెళ్లి మద్యం తాగాడన్నారు. ఆ తర్వాత శివాలయం వద్దకు వెళ్లి తనకు శని పట్టుకోవడం వల్ల జీవితం ఇలా అయిందని కోపంతో అక్కడ ఉన్న తొమ్మిది విగ్రహాలని ఇనుప రాడ్‌తో విరగ్గొట్టాడన్నారు. రాత్రంతా శివాలయంలోనే పడుకొని మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు కోనేరులో స్నానం చేసి ఇనుప రాడ్‌ను దూరంగా ఉన్న పొదలలో పడేసి వెళ్లిపోయాడని ఎస్పీ తెలిపారు. రామకృష్ణ గతంలో కూడా అదే గుడిలో పూజారి అయ్యప్ప మాల వేసిన సమయంలో 2022లో గుడిలో ఉన్న దేవుడి పటాలను పగులగొట్టాడని, దీనిపై కేసు ఉందన్నారు. కేసు దర్యాప్తులో దాలంరాజువలస గ్రామ ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించారని, వారికి జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలను ఎస్పీ తెలిపారు. తక్కువ వ్యవధిలో ఈకేసు ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఆలయాలు, చర్చ్, మసీదులు వంటి ప్రార్థన మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి అని, ప్రార్థన మందిరాలు భద్రతకు, నేరాల నియంత్రణకు భద్రత చర్యలు, జాగ్రత్తలు పాటించేలా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. మత విద్వేషాలు రేకెత్తించే ఉద్దేశంతో ప్రజల మనోభావాలు సోషల్ మీడియా వేదికగా ఇతర మతాల మనోభావాలు కించపరిచేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అతి సున్నితమైన మత అంశంపై సామాజిక మాధ్యమాలు ద్వారా అసత్య ప్రచారాలు చేసిన 12 మందిని గుర్తించామని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 3300 ప్రార్థన మందిరాలు ఉన్నాయని, వీటిలో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మిగిలిన ప్రార్థనా మందిరాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు, దాతలు సహకరించాలన్నారు. ప్రార్థన మందిరాల వద్ద రాత్రిపూట సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని, తగినంత లైటింగ్ సిస్టం ప్రార్థన మందిరాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రార్థన మందిరంలో ఉన్న హుండీలకు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తూ గ్రామాల్లో పట్టణాల్లో కొత్త వ్యక్తులు అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వివరాలు సంబంధించి పోలీస్‌స్టేషన్ కు తెలియజేయాలన్నారు. మత ఘర్షణలను ప్రేరేపించే అపోహలు వదంతులను నమ్మి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. జిల్లాలో మీడియా ప్రతినిధులు సమన్వయం సహకారంతో నేరాలు అరికట్టడంతో పాటు ఛేదించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.






### ఇసుక లారీలకు నంబర్లు..

# కథేమిటి సారూ!

* నంబర్ల వెనుక ఎవరి హస్తం
* ఎవరెవరికీ నెలవారీ కమీషన్లు వెళుతున్నాయి
* నంబర్లుంటే.. నో అబ్జెక్షన్
* ఆ వాహనాలను నో చెకింగ్

**శ్రీకాకుళం క్రైం, జూలై 14 (వార్త):** పలాస పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఇసుకను తరలించే లారీలకు నంబర్లు ఉన్న స్టిక్కర్లు అతికించి ఉన్నాయి. జిల్లాలో ఎక్కడ ఇలాంటిది లేదు. కేవలం పలాసలో మాత్రమే. దీని వెనుక మతలబు ఏంటో ఆ పెరుమాళ్‌కే ఎరుక. ఈ నంబర్లు ఉన్న లారీలను రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకోరట. ఇసుకను ఎంతైనా ఎప్పుడైనా ఎక్కడికైనా తరలించుకోవచ్చట. వీరికి నో అబ్జెక్షన్. కనీసం తనిఖీ కూడా చేయరట. కొందరు ఉన్నతాధికారులకు ఈ లారీల యజమానుల నుంచి నెలవారీ మామూళ్లు వెళుతుండడమే కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే కొందరు లారీ ఓనర్లు ఈ నంబర్లు వేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో వారి వాహనాలను ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. వారు ఇసుకను తరలించకుండా కట్టుదిట్టమైన ఆంక్షలు విధించారు. దీంతో వారు కూడా తమకెందుకులా ఈ తలనొప్పి అనుకుంటూ వారు కూడా నెలవారీ మామూళ్లు ఇచ్చుకునేందుకు ముందుకువచ్చి ఈ నంబర్లు వేయించుకున్నారని తెలిసింది. ఇసుక దందాను అడ్డుకోవాల్సిన వారే ఇలా మామూళ్లు గుంజుతుండడం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అండదండలు, అధికార పార్టీ నేతల హస్తం ఉండడంతో ఇసుక తరలింపుదారులు ఇష్టారాజ్యంగా, నిబంధనలు పాటించకుండా ఇసుకను దోచేస్తున్నారు.

(ఇసుక లారీలకు నంబర్ల వేయడం వెనుక ఎవరెవరి హస్తం ఉంది.. నెలవారీ ఎంతెంత మొత్తాలు ఎవరెవరికి అందుతుంది.. త్వరలో 'జాతీయ వార్త' సమగ్ర కథనం)



లోపల పేజీల్లో

## వంశధారకు.. వరుస గండ్లు

* ఆందోళనలో రైతులు
* తలలు పట్టుకుంటున్న అధికారులు
* పంటపొలాల్లోకి వృథాగా పోతున్న సాగునీరు

### పలాస జీడిపప్పుకు..

## జాతీయ పురస్కారం

* ఓడీఓపీలో ఉత్తమ ఉత్పత్తిగా ఎంపిక * ఢిల్లీలో అవార్డు అందుకున్న కలెక్టర్ స్వప్నిల్ * జిల్లా రైతుల సంకల్పం, అధికారుల కృషితో గొప్ప విజయం * కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న



## ఐటీఐ రెండో విడత కౌన్సిలింగ్ 23కు వాయిదా



**శ్రీకాకుళం, జులై 14(వార్త):** శ్రీకాకుళంలోని ప్రభుత్వ డీఎల్టీసి ఐ.టి.ఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 22 మధ్యాహ్నం 1 గంట లోపు మాత్రమే వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహనరావు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు ఆన్లైన్‌లో iti.ap.gov.in వెబ్సైట్ ద్వారా సమర్పించాలన్నారు. 22 జూలై మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ బలగలోని ప్రభుత్వ ఐటీఐ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే ఈ నెల 23న జరిగే కౌన్సిలింగ్ కి అనుమతించబడరని వెల్లడించారు. మహిళలకు టైలరింగ్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు. మరిన్ని వివరాలకు 9505161701, 9963945259, 9885960809 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# అర్జీలు పునరావృత్తం కాకూడదు

**-జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**

**-140 అర్జీల స్వీకరణ**



**శ్రీకాకుళం, జులై 14(వార్త):** అర్జీలు పునరావృత్తం కాకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, తదితర శాఖల సమస్యల పై 140 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ ఉన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యువజన ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ సమర్థుడు

**-మాజీ మంత్రి అప్పలరాజు**

**-సీదిరిని సన్మానించిన మడియా**



**మందస, జులై 14(వార్త):** వైఎస్సార్ సీపీ జిల్లా యువజన ప్రధానకార్యదర్శి పదవికి మడియా రామకృష్ణ అన్ని విధాలా సమర్థుడని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని నారాయణపురం పంచాయతీ కేశుపురం గ్రామానికి చెందిన మడియా రామకృష్ణ వైఎస్సార్ సీపీ యువజన ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు. దీంతో ఆయన తన అభిమానులు, పార్టీ కార్యకర్తలతో అప్పలరాజును మర్యాదపూర్వకంగా కలిసి, ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా సీదిరిని సన్మానించారు. అనతరం రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు శ్రీకాకుళం జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా నామినేటెడ్ చేసిన పలాస నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్ చార్జి, మాజీ మంత్రి డా.అప్పలరాజు సిఫార్సుతో తనకి పదవి వచ్చిందన్నారు. అప్పలరాజుకు ధన్యవాదాలు తెలపడం చాలా సంతోషంగా ఉందని, ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేస్తానన్నారు. బాధ్యతతో పనిచేసి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, నియోజకవర్గ వైఎస్సార్సీపీ అభిమానులకి తెలియజేశారు. ఈ సందర్భంగా సీదిరి కూడా రామకృష్ణను అభినంధించి, సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దున్న హరికృష్ణ, బత్తిని లక్ష్మణ్, దున్న బుజ్జి, జానకిరామ్, బత్తిని తేజేశ్వరరావు, గౌరకల పోలయ్య, మడియ భీమారావు, భాస్కరరావు, గౌరకల జగన్ పాల్గొన్నారు.

# లక్ష్యసాధన దిశగా యువత శ్రమించాలి

**-ఎమ్మెల్యే గొండు శంకర్**

**-ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో**

**జాబ్‌మేళా విజయవంతం**

**శ్రీకాకుళం, జులై 14(వార్త):** చిత్తశుద్ధితో కృషి చేస్తే ఎంతటి కష్టమైన పనైనా విజయవంతం అవుతుందని, యువత లక్ష్యసాధన దిశగా నిరంతరం శ్రమించాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్ర అధ్యక్షత వహించగా, దాదాపు 10 ప్రైవేట్ కంపెనీలు 475 ఖాళీలతో పాల్గొన్నాయి. వందలాది మంది నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాయకత్వంలో యువతకు ఉపాధి కల్పించే దిశగా గణనీయమైన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. త్వరలోనే శ్రీకాకుళంలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గం నలుమూలల నుంచి యువత ఈ మేళాలో పాల్గొన్నారని, ఉద్యోగం లభించిన అభ్యర్థులు శ్రమతో పనిచేసి జీవితాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే శంకర్ అన్ని విధాలుగా ఈ మేళాకు సహకరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు ప్రోత్సాహకాలు

**పలాస, జులై 14(వార్త):** శ్రీ విజయపురం బొడ్డపాడు జగదీశ్వర్ యూత్ సంఘం ఆధ్వర్యములో ఈ ఏడాదిలో పదవ తరగతి, ప్లస్ టు, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థి, విద్యార్థినులకు బహమతులతో పాటు ఆర్థిక సహాయా అందించి వారిని ప్రోత్సహించారు. క్రీడా, కళారంగములో క్యాషియర్‌గా రాణించి సంఘములో రిటైర్మెంటు తీసి కొన్న వారికి శ్రీ మద్చిం తాతారావుకి బెస్ట్ క్యాషియర్‌గా ఎంపిక చేసి యావత్ సంఘ సభ్యులు సమక్షములో మర్యాద పూర్వకముగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ బొడ్డు కాంతారావు, వైస్ ప్రెసిడెంట్ పోతనపల్లి కూర్మారావ్, జనరల్ సెక్రటరి గేదెల ధర్మారావు, సెక్రటరీ బైనపల్లి సుందరయ్య, క్యాషియర్ మడిగం వెంకట్, గ్రామ సర్పంచ్ మద్దిల శంకరరావు, జనరల్ సెక్రటరి బొడ్డపాడు డిల్లీ రావు, క్యాషియర్ మద్దిల తాతారావు, యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వృద్ధుడి మృతి



**శ్రీకాకుళం, జులై 14(వార్త):** శ్రీకాకుళంలోని ఏ1 హెూటల్ దగ్గరలో బాలాజీ మెడికల్ షాప్ ఎదురుగా రోడ్డు పక్కన నిద్రపోతున్న గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధుడిపైకి ఆదివారం రాత్రి 09.05 గంటల సమయంలో ఏపీ 39ఎస్‌డబ్ల్యూ 6607 కారును డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా ఎక్కించగా సదరు వ్యక్తి గాయాపడ్డారు. దీంతో ఆయనను 108లో ఆసుపత్రికి తరలించగా, అక్కడ మృతి చెందాడు. ఆవ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిసిన యెడల 9694694956, 6309990809 సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

## ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే ధ్యేయం



**పలాస, జులై 14(వార్త):** మున్సిపాలిటీలో ఉన్న ప్రతి వార్డును ఆదర్శవార్డులుగా తీర్చిదిద్దడమే తన దేయమని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. సోమవారం ఆరో వార్డు అంతర్గడ్డ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఉన్నస్కూలుకు వెళ్లే త్రావలో మురికి నీరు నిలువ ఉన్న పరిస్థితి గ్రామ పెద్దలు మున్సిపల్ చైర్మన్ గా బల్ల గిరిబాబుకి దృష్టికి తీసుకువచ్చారు. తన దృష్టికి వచ్చిన వెంటనే మున్సిపల్ డి ఈ ఏ కనకరాజు ఏ ఈ కిరణ్ సమాచారం అందించడంతో గ్రామానికి చేరుకుని మురికినీటిని బయటకు పంపించేందుకు కొత్తగా సిసి రోడ్డు వేయవలసిందని తెలియజేయగా దానికి పరిపాలన ఆమోదం మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని గ్రామ పెద్దలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బడగల మధు, మాజీ కౌన్సిలర్ అడ్డా మాధవరావు, ఉన్న పద్మలోచన, సనపల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ కొళాయిలకు సంప్రదించండి

**-మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు**

**పలాస, జులై 14(వార్త):** పబ్లిక్ కొళాయి కనెక్షన్లు కొరకు తన కార్యాలయాన్ని సంప్రదించాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు కోరారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)కార్యక్రమం లో ఆస్థి పన్ను పేరు మార్పు, జనన, మరణ సర్టిఫికెట్లు, వితంతు పెన్షన్లు, పబ్లిక్ కొళాయి కనెక్షన్ కొరకు పలు సమస్యలపై మొత్తం 12 దరఖాస్తులు అందినట్లు కమిషనర్ తెలియజేశారు. అందులో జనన, మరణ సర్టిఫికెట్లు కొరకు-5, తల్లికి వందనం కొరకు -2, ఆస్థి పన్ను పేరు మార్పు కొరకు-2, పబ్లిక్ కొళాయి కనెక్షన్ కొరకు-3 దరఖాస్తులు వెల్లడించారు. ముఖ్యంగా పబ్లిక్ కొళాయి కనెక్షన్లు కొరకు ప్రజలు ఎవరూ ఇబ్బంది పడవలసిన అవసరం లేదని, ఎవరికైనా పబ్లిక్ కొళాయి కనెక్షన్లు కావలసి వస్తే తనను నేరుగా సంప్రదించ వచ్చని మున్సిపల్ కమిషనర్ తెలియజేసారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

**-అడ్మిషన్లు 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పొడిగింపు**

**-పలాస ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పైల జవహర్**

**పలాస, జులై 14(వార్త):** ఐటిఐ లో ఉన్న మిగులు సీట్ల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం. స్థానికంగా ఉన్న డాక్టర్ వి కణితీస్ ప్రభుత్వ ఐటిఐ పలాస కళాశాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల కొరకు మిగిలి ఉన్న సీట్లకు (2వ విడత) దరఖాస్తులు 15వ తేదీ కాగా దానిని 20వ తేదీ వరకు పొడిగించాలని, విద్యార్థులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకుని అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు జూలై 22వ తేదీ 1పీఎం లోపల రావాలని కోరారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు ఈ 25న కౌన్సిలింగ్ కు తప్పకుండా హాజరు కావాలని ప్రభుత్వ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ పైల జవహర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఐటీఐకి సంబంధించి వివిధ ట్రేడ్లలో "కోపా ట్రేడ్" కు మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందని, ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు.



## కృష్ణా జడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**ఇచ్ఛాపురం, జులై 14(వార్త):** కృష్ణా జిల్లా జెడ్ పి చైర్ పర్సన్ ఉప్పాల హారిక పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైస్సార్సీపీ నాయకులు కోరారు. రాష్ట్రంలో మహిళలు కు రక్షణ లేకుండా పోయిందని దాడిని ఖండిస్తూ తహసీల్దార్ వెంకట రావు కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయి రాజు,ఎంపిపి బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, వైస్ చైర్ పర్సన్ ఉళాల భారతీ దివ్య,కాళ్ల దేవరాజు చిట్టిబాబు, ధర్మతేజ,ప్రేమ్ కుమార్, మదన్,తిరుపతి రాంజీ ఢిల్లీ, లక్ష్మీ నారాయణ, నూకయ్య,జానీ పురుషోత్తం, పిలక సంతు,సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, వివేకానంద ,దేవరాజు, సత్యం,నర్తు ప్రసాద్, ఢిల్లీ, మహేష్ సంతోష్ మండలో మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్ మందస రాక



**మందస, జులై 14(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు మందస మండలం రానున్నారని గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు సవర నీలకంఠం చెప్పారు. మందస మండలంలోని గిరిజన సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారని, సమస్యల పరిష్కారానికి మొట్టమొదటి సారిగా మందస మండలం వస్తున్నారని, ఆయా మండలాల్లో ఉన్న గిరిజన సమస్యలను ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి వినతిపత్రం ద్వారా తెలియజేయాలని కోరారు. కార్యక్రమానికి మండలంలోని గిరిజన గ్రామాల్లో గిరిజనులు వచ్చి విజయవంతం చేయాలని అన్నారు.

## ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన సద్వినియోగం చేసుకోండి

**ఇచ్ఛాపురం, జులై 14(వార్త):** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ కోరారు. ఎకరా కి 168 రూపాయలు చెల్లించాలని చెప్పారు.ఖరీఫ్ సీజన్ కి రైతులు ఈ పంట ద్వారా సర్టిఫికెట్ పొందాలని చెప్పారు.సచివాలయంలో కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా చెల్లించ వచ్చని చెప్పారు.ఆగస్ట్ 15 లోగా నమోదు చేసుకోవాలని చెప్పారు.

## వైసీపీ నాయకుల ఆత్మీయ కలయిక



**పలాస, జులై 14(వార్త):** వైసిపి నాయకులు ఆత్మీయ కలయికలో పలాస మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉంటేనే అనుకున్నది సాధిస్తామని చెప్పారు. సోమవారం పలాస మండలం తరలకోట పంచాయతీ కొత్తూరు గ్రామంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆత్మీయ కలయికలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్, ఎక్స్ ఎం పి టి సి ఎక్స్ సర్పంచ్ మరడ భాస్కర్ రెడ్డి, వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు గోర్లు వేణు, పైల తిరుమలరావు, లంబాడ జానకిరామ్, పైడి ధనుంజయ్ రామ్, గ్రామ పెద్దలతో ఆరా తీశారు.

## బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ

**శ్రీకాకుళం, జులై 14(వార్త):** భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్ (ఆదేశాల మేరకు శ్రీకాకుళం రెవిన్యూ డివిజనల్ అధికారిణి కుమారి కె.సాయి ప్రత్యుష ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు 100 నుంచి 150 వరకూ ఉన్న పోలింగ్ కేంద్రాల బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ జరిగింది. శ్రీకాకుళం రెవెన్యూ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో జరిగిన ఈ శిక్షణలో ఓటర్ల జాబితా నిర్వహణ, క్లెయిమ్స్, అభ్యంతరాలు, బీఎల్ఓ అప్లికేషన్ వినియోగం, ఈసీఐ వెబ్‌సైట్ వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోడ్‌లో పరీక్ష కూడా నిర్వహించి బీఎల్‌వోల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ శిక్షణలో ఎన్నికల డీటీ జి.కె. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ చక్రవర్తి, జానకి, రాజశేఖర్ తదితర బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.




# ప్రజా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

**-పోలీసు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి 65 వినతులు**

**-జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి**



**శ్రీకాకుళం, జులై 14(వార్త):** పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే ప్రజా ఫిర్యాదులు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా, త్వరితన ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తి స్థాయిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ.. 65 మంది ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్ (జూమ్ కాన్ఫరెన్స్) ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.ప్రజా పిర్యాదులు పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు.ఈ క్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా వృద్దులు వికలాంగుల అర్జీ దారులు తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు. పిర్యాదులు వివరాలు మొత్తం 65 స్వీకరించగా అందులో కుటుంబ, మోసపూరితమైన, ఆస్తి తగాదాల, సివిల్, ఇతరత్రా అంశాలు ఉన్నాయి,

# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : శిరీష






**మందస, జులై 14(వార్త):** సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని బహడపల్లిలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమా లకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఇంటిం టికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. రాబోయే పథకాల గుర్చి వివరించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు కొనసాగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు హామీలను నెరవేరుస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శిరీషాకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో టీడీపీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, దాసరి తాతారావు, కొర్ల కన్నారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, ఎం.నవీన్ కుమార్, శిర్ల కృష్ణారావు, ఎం.తాతారావు, చౌదరి మురళీకృష్ణ, టీడీపీ మందస మండల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఇంటింటా ప్రచారం

**పలాస, జులై 14(వార్త):** ఉత్సాహంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం పూండి (వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం)లో నిర్వహించారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పలాస నియోజకవర్గంలో ఎమ్మెల్యే గౌతు శిరీషమ్మ సహకారంతో రాబోయే నాలుగేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులకు, అన్ని పథకాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ సీపాన గోపి, ఎస్ఎంసి చైర్మన్ కర్ని శ్రీను, టీడీపీ సీనియర్ నాయకులు గోరకల విఘ్నేష్, పాలిన మోహన్ రావు, పాలిన చంద్రయ్య, రత్నాల తుంబనాథం, బొమ్మాళి కామేష్, డొక్కరి రాజు, మెట్ట నారాయణ మరియు కృష్ణార్జున యువ సైన్యం సభ్యులు గోరకల నరేష్, సంతు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**- డీఆర్ఓ వెంకటేశ్వరరావు**

**-జూలై 15 నుంచి 23 వరకు పరీక్షలు**

**శ్రీకాకుళం, జులై 14(వార్త):** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) లెక్చరర్ పోస్టులకు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై 15 నుంచి 23 వరకు (జూలై 19 మినహా) జరిగే ఈ పరీక్షలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. మొత్తం 743 మంది అభ్యర్థుల కోసం జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు.

### పరీక్షా కేంద్రాలివే..

జిల్లాలో ఎంపిక చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలు.. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట), ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (టెక్కలి). ప్రతి కేంద్రంలోనూ బయోమెట్రిక్ ధృవీకరణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు భద్రత, వైద్య సహాయం, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అన్ని ఏర్పాట్లు చేశామని డీఆర్ఓ వెల్లడించారు.

### నిబంధనలు తప్పనిసరి..

అభ్యర్థులు పరీక్షకు ఒరిజినల్ ఫోటో ఐడీ తీసుకురావాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, పేపర్లు వంటి వాటిని అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. ఉదయం జరిగే పరీక్షలకు అభ్యర్థులను 8:00 నుంచి 8:45 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షలకు 1:00 నుంచి 1:45 గంటల వరకు అనుమతిస్తామని తెలిపారు. ఈ సమయానికి అదనంగా గరిష్టంగా 15 నిమిషాల సమయ వెసులుబాటు ఉంటుందని, ఉదయం 9:00 గంటల తర్వాత లేదా మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా హాలులోకి అనుమతించబడరని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో రూరల్



సీఐ పైడపు నాయుడు, డిప్యూటీ తహసీల్దార్లు ఎస్. బాలకృష్ణ (ఎచ్చర్ల), డి. రామకృష్ణ (నరసన్నపేట), పి. నిరంజన్ కుమార్ (టెక్కలి), కళాశాల ప్రతినిధులు జనార్ధనరావు (శ్రీ వెంకటేశ్వర), పి. ప్రదీప్ (శ్రీ శివానీ), బి.రవిశంకర్ (కోర్ టెక్నాలజీస్), శ్రీనుబాబు దాసరి (ఆదిత్య ఇనిస్టిట్యూట్) తదితరులు హాజరయ్యారు.

## ట్రిపుల్ ఐటీకి డొంకూరు విద్యార్థి ఎంపిక



**ఇచ్ఛాపురం, జులై 14(వార్త):** ట్రిపుల్ ఐటీకి ఎంపికైన డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.నితిన్‌ను సోమవారం హెచ్ఎం జి.హేమకుమారి అధ్యక్షతన జరిగిన సభలో అభినందించారు. పాఠశాల చైర్మన్ కె.జానకిరావు, మాజీ చైర్మన్ దున్న కూర్మారావు, నీటి సంఘం అధ్యక్షుడు గురుమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ వెంకటరమణ, ఎల్.గోవిందరావు, కమలాకర్ శ్రీహరి, శంకర్ రెడ్డి, ఉపాధ్యాయిని, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# సచివాలయం ఖాళీ

- కానరాని సిబ్బంది
- సంతబొమ్మాళిలో ఇదీ పరిస్థితి
- అధికారుల పర్యవేక్షణా లోపం




**(సంతబొమ్మాళి)**

మండల కేంద్రమైన సంతబొమ్మాళి-2 సచివాలయంలో సోమవారం 11:30 వరకు సిబ్బంది పూర్తిగా లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని సచివాలయ సిబ్బంది నీరు గారుస్తున్నారు. ప్రతిరోజు సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ సంతబొమ్మాళి-2 సచివాలయంలో సిబ్బంది జాడ కానరావడం లేదు. మండల కేంద్రంలో సచివాలయాలలో పరిస్థితి ఇలా ఉందంటే మండల పరిధిలో ఉన్న సచివాలయాలలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థమవుతోంది. వివిధ పనుల మీద సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులకు కనీసం సమాధానం చెప్పడానికి ఏ ఒక్క సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఎవరైనా ప్రశ్నిస్తే ఫీల్డ్ లో ఉన్నాము, అధికారుల దగ్గరకు వెళ్ళాము, బదిలీలలో బిజీగా ఉన్నాం వంటి సమాధానాలు ఇస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు పనిచేసేందుకు సిబ్బంది ఉండటం లేదని బహిరంగ విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తోపాటు వివిధ పత్రాల కోసం సచివాలయానికి వచ్చిన వారికి నిరాశ తప్పడం లేదు. దీంతో సచివాలయ సిబ్బంది పనితీరుపై వివిధ పనుల పై వచ్చిన వారు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు . సచివాలయంలో సిబ్బంది సకాలంలో హాజరు కావడం లేదని ఎవరు సక్రమంగా పనిచేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం సిబ్బంది ఎక్కడికి వెళ్లారో మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయకపోవడం వారికి నిర్లక్ష్యానికి చాటి చెబుతోంది. సచివాలయంలో 11 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒకరు కూడా సమయానికి విధ్యులలో హాజరు కాకపోవడం లబ్ధిదారులు అవాక్కవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సచివాలయాన్ని పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.





## కుంటికోట గ్రామ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

**మందస, జులై 14(వార్త):** మండల మహిళా సమాఖ్య పరిధిలోగల కుంటికోట గ్రామ సంఘం వార్షిక మహాజన సభ జరిగింది. పాలక కార్యనిర్వాహక వర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులతో క్లస్టర్ కోఆర్డినేటర్ గేదెల స్వామి నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళా పరస్పర సహాయ సహకార గ్రామ సంఘం 1995 సహకార చట్టం ప్రకారం ప్రతి ఏడాది కూడా గ్రామ సంఘం లెక్కలను చార్టెడ్ అకౌంటెంట్ వారితో ఆడిట్ చేయించుకుని, గ్రామ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని, కొత్త పాలకవర్గంతో పాటు, నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక జరగవలసి ఉన్నందున షెడ్యూల్ ప్రకారం మండలంలో గల అన్ని గ్రామ సంఘాలలో కూడా మహాజనసభలు జరుగుతున్నట్లు వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. అధ్యక్షురాలుగా టి.గీతారాణి, కార్యదర్శిగా బి.కుమారి, కోశాధికారిగా టి.కల్పన, ఉపాధ్యక్షురాలుగా కె.భాగ్యలక్ష్మి, ఉపకార్యదర్శిగా పుష్పలత, ఏకగ్రీవంగా ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో వీవోఏ గుంట సుదర్శనదేవి, గ్రామ సంఘం సహాయకుడు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ హోంగార్డునకు ఘనంగా సత్కరించిన ఎస్పీ



**శ్రీకాకుళం, జులై 14(వార్త):** ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంగా పై శ్రద్ద వహించి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి కోరారు. జిల్లా హోంగార్డు విభాగము నకు చెంది, హోంగార్డు విధులు నిర్వర్తిస్తూ జులై 11 తేదీన ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఎల్.వి.ఆర్ మూర్తి ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ చేతుల మీదగా దుశ్శాలువతో ఘనంగా సత్కరించి,జ్ఞాపిక అందించి సర్వీస్ ప్రశంసాపత్రం ప్రధానం చేశారు. ఈ నేపథ్యంలో తక్షణ ఆర్థిక చేయూతగా ఐదు వేలు రూపాయలు నగదు చెక్కును జిల్లా ఎస్పీ అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘంగా హోంగార్డుగా విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేయడం,కేటాయించిన అన్ని విధులు అంకిత భావంతో నిర్వర్తించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎటువంటి సహాయం, అవసరం ఉన్న పోలీసు శాఖ తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వ్యక్తిగత పరమైన ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా కలిసి తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో సిహెచ్ గోపినాథ్, ఆర్ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

## వంశధారకు
# వరుస గండ్లు



- ఆందోళనలో రైతులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, జులై 14 (వార్త):** గొట్టాబ్యారేజీ ఎడమ ప్రధాన కాలువకు మళ్లీ గండిపడింది. ఈనెల రెండోతేదీన నీరు విడిచిపెట్టిన తర్వాత రెండసారి గండి పడడంతో వంశధార అధికారులు తలలు పట్టుకుంటుండగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం పింద్రువాడకాలనీ సమీపంలో 5ఆర్ స్లూయిస్ వద్ద గట్టుకు గండి పడి పంటపొలాల్లో నీరు చేరింది. దీన్ని గమనించిన రైతులు వెంటనే వంశధార అధికారులకు సమాచారం అందించారు. గొట్టాబ్యారేజీ ఈఈ మురళీమోహన్, ఏఈఈ ధనుంజయరావుతో



పాటు సిబ్బంది హుటాహుటిన గండిపడిన ప్రాంతానికి చేరుకున్నారు. వెంటనే నీటి విడుదలను ఆపేశారు. యుద్ధప్రాతిపాదికన గండిపూడ్చే పనులు చేపట్టారు. కాగా ఎడమ కాలువ గట్టుకు గండి పడిన ప్రదేశానికి దగ్గరలోనే మరో స్లూయిస్ వద్ద గట్టుకు రంధ్రం ఏర్పడింది. దీన్ని కూడా పూడ్చివేయించారు. ఎడమ ప్రధాన కాలువకు వరుసగా గండ్లు పడుతున్నాయి. ఎలుకలు గట్టు కింద రంధ్రాలు చేస్తున్నాయని వంశధార అధికారులు చెబుతున్నారు. కాలువల గట్లు ఆధునీకరణ చేయకపోవడంతో ఎప్పటికప్పుడు రంధ్రాలు పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఇటీవల టెక్కలి సమీపంలో కూడా ఎడమ ప్రధాన కాలువకు గండి పడిన విషయం తెలిసిందే. లస్కర్లు లేకపోవడంతో ఎక్కడెక్కడ వంశధార ఎడమ కాలువ బలహీనంగా ఉందన్నది అధికారులు గుర్తించలేకపోతున్నారు.

# పలాస జీడిపప్పుకు.. జాతీయ పురస్కారం

- ఓడీఓపీలో ఉత్తమ ఉత్పత్తిగా ఎంపిక
- ఢిల్లీలో అవార్డు అందుకున్న కలెక్టర్ స్వప్నిల్
- జిల్లా రైతుల సంకల్పం, అధికారుల కృషితో గొప్ప విజయం
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న

**శ్రీకాకుళం, జులై 14 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ప్రతిష్టను దేశవ్యాప్తంగా చాటుతూ పలాస జీడిపప్పు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపి) కింద ఉత్తమ ఉత్పత్తిగా ఎంపికై జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. ఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, కేంద్ర వస్త్రోత్పత్తుల శాఖ మంత్రి జితిన్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ మాట్లాడుతూ, తిత్లీ తుఫాను తీవ్రంగా నష్టపరిచినా... అదే ఓ మలుపుగా మారిందన్నారు. పునరుద్ధరణ చర్యలు, అధిక దిగుబడినిచ్చే జాతుల ప్రోత్సాహం, ఉపాధి హామీ పథకం వినియోగంతో జీడి సాగు విస్తరించిందన్నారు. జీడిపప్పు




ప్రాసెసింగ్ పరిశ్రమలకు నూతన దిశ చూపగలిగామని తెలిపారు. ఇది రైతుల కృషికి, అధికార యంత్రాంగ ప్రణాళికా బద్ధమైన కార్యాచరణకు లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ప్రసాద తయారీలో రోజూ 3,000 కిలోల పలాస జీడిపప్పు వినియోగంలో ఉందని, ఇది జాతీయ గుర్తింపునకు ఒక ప్రధాన కారణమన్నారు.

### మంత్రుల అభినందన..

పలాస జీడిపప్పుకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సంకల్పం, అధికారుల కృషి కలిసి ఓ గొప్ప విజయాన్ని సాధించామన్నారు. ఇది రాష్ట్ర ఉద్యాన రంగానికే మైలురాయిగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్న ప్రశంసించారు. పలాస జీడిపప్పుకు లభించిన జాతీయ స్థాయి ఉత్తమ ఓడీఓపి అవార్డు శ్రీకాకుళం జిల్లా కీర్తిని ఢిల్లీకి చేర్చిందని రామ్మోహన్ అన్నారు. ఈ అవార్డు శ్రీకాకుళం జిల్లా రైతులు, అధికారుల ఉమ్మడి కృషికి నిదర్శనమని ప్రశంసించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546